అన్నదమ్ములు

"శాంతిశ్రీ"

రఘునాథరావు గారికి తల నెరిసిపోయింది. అక్కడక్కడ పళ్లుకూడా వూడిపోయాయి. ఊడవూ! మరి ముసలితనం వస్తే! ఆయన వయసు షుమారు అరవై అయిదు సంవత్సరాలుంటుంది. కాని ఎప్పుడూ యేదో ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు రావుగారు. వారికి ముగ్గురు సంతానం. రవీంద్ర, నరేంద్ర అని యిద్దరు కుమారులు, ఉష అనే కుమార్తె. ఆయన భార్య శ్యామలాంబ, చాలా వుత్తమురాలు, శీలవతి. రఘునాథరావుగారికి రవీంద్ర పుట్టిన సంవత్సరానికే నరేంద్ర పుట్టాడు. ఉష నరేంద్రునికంటే ఆరేండ్లు చిన్నది. రావుగారు కుమారుల్ని డాక్టర్లని చెయ్యాలని వాళ్ల చిన్నతనంనుండి ఎన్నో కలలు గన్నారు. ఎన్నో ఊహా సౌధాలు నిర్మించుకున్నారు. వారికి చేతినిండా ధనంవుంది. వారి కోరికలు నెరవేరడానికా ధనం ఎంతో వుపకరించింది. ఆయన కలలు కొంతమందిలోలా కలలుగానే వుండక నిజమైనవి. రవీంద్ర నరేంద్ర యిద్దరూ డాక్టర్లయ్యారు. అయితే రవీంద్రకీ నరేంద్రకీ ప్రకృతుల్లో చాలా భేదంవుంది. రవీంద్రకి గొప్ప బీద అనే తారతమ్యంగాని కులవిచక్షణగాని యేమీలేదు. తను గొప్పవారి బిడ్డనని నిద్రలోకూడ అతను గర్వపడడు. ఉషకి కొంచెం రవీంద్ర గుణాలే వచ్చాయి. రవీంద్రంటే యెక్కువ చనువు గౌరవం ఆమెకు. తన కుమారులిద్దరూ డాక్టర్లు; పయిగా ధనవంతులు. తప్పక చేరోక లక్షా కట్నం వస్తుందని అంచనా వేశారు రఘునాథరావు గారు. ఆయన అనుకొన్నట్లుగాక ఇద్దరికీకలిపి ఒక 'ల' కారమే పలికింది కట్నం. దానికి కారణం రవీంద్ర. రవీంద్ర కట్నాని కాశపడలేదు. అతని కాయాశ ఏనాడూలేదు. మనిషి చాలా నిరాడంబరుడు. అతను తనసహపాఠి మల్లికను ప్రేమించి పెండ్లాడటమే ఆనష్టానికి కారణం. ఈ పెండ్లి తండ్రికి సుతరామూ యిష్టంలేదు. తను చెబితే వినలేదని తల్లితోకూడా చెప్పించి చూశాడాయన. కాని రవీంద్ర వింటేనా. అతను హృదయాలను అర్థం చేసుకోగలడతనికీ హృదయంవుంది కనుక. డబ్బు లెక్కలలో తండ్రి హృదయం పాషాణమయం అంటాడు రవీంద్ర. ఈ వివాహం ఆ కుటుంబంలో కలతల్ని లేపింది. కుటుంబ విచ్ఛిన్నానికి కారణం అయింది. తండ్రి రవీంద్రుని యింట్లోనుండి వెళ్లగొట్టాడు. నరేంద్ర చూస్తూ వూరుకున్నాడేమీ చెప్పలేక. ఉష శ్యామలాంబ గోలు గోలున యేడ్చారు రవీంద్ర వెళ్తూంటే. రవీంద్ర ఆ వూరులోనే వేరే చిన్నయిల్లు కట్టుకున్నాడు. ప్రాక్టీసుకూడా ప్రారంభించాడు.

నరేంద్రకి తండ్రి యిష్టప్రకారం "గొప్ప" సంబంధం స్థిరమయింది. కట్నం తండ్రి కోరిక ప్రకారం లక్షరూపాయలు. ఆ తలిదండ్రుల కామె యొక్కతే కుమార్తె. పేరు ఉమాదేవి. వివాహం వైభవంగా జరిగింది. పెండ్లికి రవీంద్రుని తండ్రి పిలువనంపకపోయినా కన్నతల్లిప్రాణం వూరుకోకపోవడంచేత వెళ్ళి ఆ దంపతులను వెంటబెట్టుకుని వచ్చింది. ఉషకి మల్లికతో ఆ రెండు రోజుల్లో బాగా చనువయింది. మల్లిక శాంతం ఉష హృదయాన్ని దొంగిలించి తన వెంట తీసుకుపోయింది తనకు తెలియకుండానె. ఉష బి. ఎ పూర్తిచేసి యిక చదువుకు స్వస్తిచెప్పి యింట్లోనే వుంటోంది. తగిన సంబంధంకోరకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆమె బాగా చదువుకున్నదాయెమరి. అందులో ధనవంతులబిడ్డ. వారి కోరికల ప్రకారం తగిన సంబంధం కుదరాలంటే మాటలామరి!

ఉమ అత్తవారింటికి కాపురానికొచ్చింది. పెద్దకొడుక్కి పెండ్లయినా ఆ కోడలికి తొలుత నీ యింటి కాపురంచేసే అదృష్టం లేకపోయింది. ఆ యింట్లో మొదట ఉమాదేవి కాపరానికొచ్చింది. ఆ రోజామె

తెచ్చిన సారె పూరంతా పెద్దయెత్తున పంచిపెట్టారు. చూచేవాళ్లకెంతో ఘనంగా అత్తవారింట్లో అడుగు పెట్టింది ఉష. ఉషకూడా యింటర్ వరకూ చదివింది. విద్యావంతురాలు. అందమైనదీని. ఉషకి పెండ్లిఅవకముందే రవీంద్ర పెండ్లి గురించి జరిగిన గందరగోళమంతా తెలుసు. పెండ్లి రెండు రోజుల్లోనూ ఒక్కసారికూడా మల్లికతో నోరువిప్పి మాట్లాడలేకపోయింది. ఆమె దీనవదనం ఉష హృదయంలో పీఠంవేసింది. మల్లికను యెరుగని ముందే ఎట్లా తప్పించుకోయిందని చాలా బాధపడింది. ఉష పెండ్లి మాటలు సాగుతున్నాయి. రవీంద్రకొక స్నేహితుడున్నాడు. వాళ్లిద్దరూ చదువుకునే నాటినుంచీ యింటికి వచ్చేవాడప్పుడప్పుడూ కరుణాకర్. అతను మధ్యతరగతికుటుంబంలోనివాడు. ప్లీడరుచదివి ప్రాక్టీసు పెట్టాడు. అతనితో ఉషకూడా చాలా చనువుగా వుంటుంది. అతనంటే యామెకిష్టంకూడా. కాని యతన్ని ప్రేమిస్తున్నానని మాత్రం ఉష పైకెన్నడూ అనలేదు. కాని రవీంద్రకు తెలుసు చెల్లెలి హృదయం. రవీంద్ర ఒక రోజు నరేంద్రుణ్ణి హాస్టల్లో కలుసుకొని ఉషని కరుణాకర్ కిస్తే బావుంటుందని సూచించాడు. నరేంద్రుడు అన్నతో బాగానే మాట్లాడతాడుగాని అన్న చేసేపనులకు మాత్రం ఆమోదించడు. అన్న చెప్పిందంతావిని నాన్నగార్కి చెప్పి చూస్తానని సమాధానం యిచ్చాడు. నిజానికి నరేంద్రునికా సంబంధం యిష్టంలేదు. తండ్రికూడా అందుకనుగుణంగానే "ఏమిటీ? ఆ చెట్టుక్రింద ప్లీడరుకా మన బంగారుతల్లి ఉషనిచ్చేది. ఇలాటి సంబంధమా చెల్లెలికి తీసుకువచ్చేది. చెడినవాడెలాగూ చెడనే చెడ్డాడు - మళ్లా కుటుంబంలో జోక్యం ఎందుకు కలుగజేసుకోవాల"ని పెద్దకొడుకుమీద మండిపడ్డాడు రఘునాధరావు. రవీంద్ర అంత కానిపనేం జేశాడు యీ నిందలుపడడానికి? తనకులం అమ్మాయినే పెండ్లిజేసుకున్నాడే. భగవంతుడా రత్నాన్ని బీదవాళ్ళింట్లో పుట్టించాడు. దానిలో రవీంద్రుడు చేసిన తప్పేముంది నిజానికి. కించిత్ కూడా మనకి కనిపించదు. కాని రావుగారి దృష్టిలో క్షమింపరాని పెద్దనేరముంది. ఒకరోజు వాళ్ళ కాలేజీలో యేదో పాతవిద్యార్థుల ఫంక్షన్ కి ఉష వెళ్ళింది. రవీంద్ర, నరేంద్ర, కరుణాకర్ కూడా వెళ్ళారు. కరుణాకర్, రవీంద్ర ఒక ప్రక్కన కూర్చున్నారు. నరేంద్ర రెండవ ప్రక్కన కూర్చున్నాడు. ఉష వెళ్ళి వాళ్ల పెద్దన్నయ్య ప్రక్కన కూర్చుంది.

"ఏం ఉషా! అమ్మా నాన్నా అంతా బాగున్నారా" అన్నాడు రవీంద్ర.

"అంతా బాగానే వున్నారన్నయ్యా" అంది ఉష. అంతలోనే కరుణాకర్ "ఏం ఉషా! ఈ మధ్య అసలు కనిపించడమే మానేశావ్. ఇదివరకటికంటే చాలా మారిపోయావు సుమా" అన్నాడు.

"లేదు కరుణా! నేనేం మారలేదు. నువ్వే మా యింటికి రావడం అసలు మానేశావ్. ఏం! పెద్దన్నయ్య లేకపోతే మాత్రం ఇంకా ఎవరూ లేరనుకున్నావా?" అంది కొంచెం కష్టంగా.

ఇది వింటూన్న రవీంద్ర "నువ్వు మా యింటికి రాలేదు. నువ్వు మా యింటికిరాలేదు అనుకోకపోతే ఇద్దరూ ఒక్కింట్లోనే వుండే యేర్పాటు చేసుకుంటే ఏ బాధ లేదుగా" అన్నాడు. దానికి కరుణ ఉషవైపుచూస్తే ఉష మందహాసంచేసి తలవంచుకుంది. రవీంద్ర ఏంరా కరుణా సమాధానం చెప్పవేంఅంటే "నా మనస్సు నీకు తెలిసిం తరువాతకూడా ఎందుకురా యీ పరీక్షలు" అని నవ్వాడు చిన్నగా.

దూరాన్నుంచి ఇదంతా చూస్తున్న నరేంద్రుడు కోపంతో ముక్కుపుటాలెగురవేస్తున్నాడు. అంతలోకి ఏదో వుపన్యాసం మొదలుపెట్టడంవల్ల సంభాషణాగిపోయింది. నరేంద్ర మధ్యలోనే లేచి యింటికి వెళ్ళాడు కోపంగా. కొడుకు కోపంగా వుండటం చూచి తండ్రి కారణం అడిగితే పూసగ్రుచ్చినట్లు జరిగిందంతా విన్నవించాడు. తండ్రి నిప్పుత్రొక్కిన కోతిలాగ గంతులువేయడం మొదలుపెట్టాడు. అంతలోకి ఉష వచ్చింది.

"ఉషా ఎక్కడికి వెళ్ళావ్ ?"

"మా కాలేజి పాతవిద్యార్థుల ఫంక్షన్‌కి వెళ్తానంటే వెళ్ళమన్నారుగా నాన్నా!"

"ఫంక్షనుకి వెళ్ళమంటే ఆ వెధవతో సరసాలాడమనా అర్థం?"

"అదికాదు నాన్నా. పెద్దన్నయ్య ..."

"హుం! పెద్దన్నయ్య. మాలావు దొరికాడు పెద్దన్నయ్య! వుద్ధరించడానికి. ఇదిగో ఉషా- చెబుతున్నాను విను. ఈ రోజు మొదలు ఎక్కడికీ వెళ్ళకు. నీ పెద్దన్నయ్యతోగాని వాడిఫ్రెండుతోగాని మాట్లాడావంటే మాట దక్కదు. వెళ్ళు పైకి" అని కఠినంగా మందలించాడు. ఉష బరువైన హృదయంతో వెళ్ళిపోయిందక్కడనుండి. ఆ రోజామె భోజనం చెయ్యలేదు. ఏడుస్తూనే ఆ రాత్రి గడిపివేసింది. ఇవన్నీ చూస్తూ గ్రుడ్ల నీరు కుక్కుకుంది తల్లి శ్యామలాంబ. ఉష బెంగతో మంచం పట్టింది. నాన్నగారలా అనగానే నరేంద్రతోకూడ చెప్పి చూసింది ఉష. కాని లాభంలేకపోయింది. ఉష పదిరోజుల్లో బాగా చిక్కిపోయింది. శ్యామలాంబ భర్తతో చెప్పింది, ఉష బెంగతో చిక్కిపోయిందని. రావుగారు నరేంద్రను పిలిచి కాస్త ఉషకి నచ్చచెప్పమని చెప్పారు. ఎలాగయినా అన్నకి చెల్లెలిమీద అసలు ప్రేమలేకుండా పోతుందా! — చిక్కి శల్యమైన ఉషని చూడగానే భ్రాతృప్రేమ సహజరూపంతో పొంగి పొరలింది. "ఉషా!" అంటూ తల నిమిరాడు. ఉషకూడా అన్నయ్యా! అంటూ బావురుమంది. నరేంద్రమనస్సు కొంచెం చలించింది. అయినా ఉషకి తండ్రి చెప్పమన్నట్లు చెప్పిచూశాడు తండ్రికి జడిసి. కాని ఉష అందులకుసమ్మతి తెలిపింది. నరేంద్రునికి తండ్రి పట్టుదల తెలుసు. అందుకే అన్నను వెళ్ళగొట్టినప్పుడూ మాటాడలేక పోయాడు. ఇప్పుడు మాట్లాడలేక పోతున్నాడు తండ్రిదగ్గర. ఉష నరేంద్రుని అసమర్థతకు చాలా విచారించింది. మళ్ళా విషాదంలో మునిగింది. ఉషకి ఒకరోజు జ్వరం వచ్చింది. కాని తల్లికి కూడ చెప్పలేదామె. మరునాడుకూడా తగ్గలేదు. తల్లికి తెలిసిపోయింది కూతురు జ్వరంసంగతి. మూడో రోజుకి జ్వరం ఎక్కువయింది — శ్యామలాంబగారు రావుగారితో చెప్పి ఒక్కగానొక్క కూతురిలా అయిపోయిందని గుండెలు బాదుకుంది. రావుగారు వచ్చేసరికి ఉష పడుకుని వుంది. 'అమ్మా! ఉషా' అని పిలవగానే ఉష కళ్ళు తెరచి కనుకొలుకుల్లో నీరునిండగా హృదయ విదారకంగా 'నాన్నా' అంటూ కన్నీరు కార్చింది. కాని రవీంద్ర జ్ఞాపకం రాగానే కరగిన ఆయన మనసంతా మళ్ళా ఒక్కసారి ఘనీభవించిపోయింది. నరేంద్ర ఏవో మంచిమంచి మందులే వాడుతున్నాడు చెల్లెలికి. కాని ఉషకి జ్వరం తగ్గుముఖం పెట్టలేదు. ఇంకా పెద్ద డాక్టర్లనికూడా పిలిపించారు రావుగారు. కాని లాభం కనిపించలేదు. ఉష ఒకరోజు జ్వరతీవ్రతలో "పెద్దన్నయ్యా" అని కలవరించింది. అది విని పోనీ, రవీంద్రవస్తే తగ్గుతుందేమో నని భర్తతో చెప్పిచూసింది శ్యామలాంబ గారు. రావుగారప్పటికి కూడ మనస్సు మార్చుకోలేకపోయారు. ఉష మధ్య మధ్య "పెద్దన్నయ్యా... వదినా" అని కలవరించుతోంది. ఒక రోజామె స్థితి మరీ ప్రమాదకరంగా వుంది. పెద్దడాక్టరుగారు కలవరింతలు విన్నారు. రవీంద్ర వస్తేగాని ఆమె ప్రాణం నిలవదని కచ్చితంగా చెప్పారు. నరేంద్రకూడా "నాన్నగారూ, చెల్లాయికోరకు-మన ముద్దుల ఉష కోరకు అన్నయ్యను, వదిననూ రప్పించండి. లేకపోతే ఉష యిక మనకి కనిపించదు" అంటూ బ్రతిమాలాడు. రావుగార్కి ఏమీ తోచడంలేదు. చివరికి తప్పక రవీంద్రకి కబురు పంపారు ఉషకి ప్రమాదంగా వుందని. మరుక్షణంలో రవీంద్ర, మల్లిక యిద్దరూ ఉషా అంటూ దగ్గరవాలారు. మల్లిక నిద్రాహారాలు మాని ఉషని కంటికి, రెప్పగా కాపాడింది. రవీంద్ర కూడ భోజనంకూడా మాని తన అనుంగు చెల్లాయి దగ్గరే కూర్చొని క్రొత్త క్రొత్త పుస్తకాలు చదివి ఎక్కడివో చాలా ఖరీదైన మందులు తెప్పించి వాడుతున్నాడు. స్పృహ రాగానే ఉష 'అన్నయ్యా! వదినా!' అంటూ ఆనంద భాష్పాలు రాల్చింది. అంత నీరసంతోనూ ఆమె కళ్ళు ఆకాశంలోకి తారకలలా మిలమిల మెరిశాయి. ఆమె మనస్సు నిర్మలమైంది. పయిగా చల్లని మల్లిక చేతుల్లో త్వరలో కోలుకుంది.

ఈ అన్నా వదినల సేవని వారి ప్రేమను కనులార చూశారు రావుగారు. నరేంద్రకూడా వారిలోని గొప్పతనాన్ని గ్రహించగలిగాడు. ఉషకి జ్వరం తగ్గేసరికి రవీంద్రకి గడ్డం పెరిగింది. కళ్లు గుంటలుపడ్డాయి. మల్లిక వినీలకుంతలాలు తైలసంస్కారం లేక పిచ్చిగా వుంది. ఆమె కళ్ళక్రింద నల్లదనం స్పష్టంగా కనబడుతోంది. ఉషకి జ్వరం తగ్గాక వారికి సంతోషం - బలం వచ్చాయి. ఉషకి బాగా స్వస్థతచేకూరి లేచి బాగా తిరుగుతోంది. ఇల్లు ఎంతో కళకళ్లాడుతోంది ఎంతో కాలానికి. ఒకరోజు రవీంద్రుడు "మామగారూ. ఇక మేము మా యింటికి వెడతాము. ఉష కులాసాగా వుందిగా" అన్నాడు. ఆ మాట వినగానే రావుగారి కళ్ళవెంట కన్నీరు జలజలా రాలినవి. తలయెత్తి రవీంద్ర ముఖం చూసి "నాయనా! రవీంద్రా!" అంటూ ప్రేమతో కౌగలించుకున్నారు. రవీంద్రకికూడా కండ్లు నీరు నిండినవి "బాబూ. ఇప్పటి నీ తండ్రి ఇదివరకు ధనవంతుడు రఘునాధరావు కాదు బాబూ. తన ముద్దుబిడ్డల తండ్రిమాత్రమే బాబూ! నిజంగా మల్లిక ఎంత గుణవంతురాలు. ఆమె శాంతం ఓరిమి యిప్పటికిగాని యీ పాపాత్ముడు తెలిసుకోలేకపోయాడు. ఇక నీవూ, అమ్మాయీ యీ యింట్లోనే వుండాలి. కాదంటే యీ ముసలి తండ్రిమీద ఒట్టేబాబూ" అంటూ కళ్లు తుడుచుకున్నాడు. ఈ మాటలు విని శ్యామలాంబగారు పొంగిపోయారు. ఉష ఆనందానికి అంతేలేదు. నరేంద్రకూడా చాలా సంతోషించాడు. ఉమకి అక్కగారి గుణగణాలు అర్థమైనాయి. ఆమె మనసుకూడ మారిపోయింది. మల్లిక, ఉమ, ఉషలను చూసి రావుగారెంతో సంతోషించారు. ముగ్గురూ సరస్వతి లక్ష్మి పార్వతులని తలపోశారు. ఒకరోజు ఎవరికీ చెప్పకుండా రావుగారూ ఒకఘన కార్యం చేశారు. అదేమిటని అడుగుతున్నారా? కరుణాకర్‌కి కబురంపారు. కరుణాకర్ రాగానే రావుగారెంతో ఆదరించి కుశల ప్రశ్నలు వేశారు. ఈ అవ్యాజ ప్రేమకు కరుణాకర్ ఆశ్చర్యపడ్డాడు. కరుణాకర్‌తో త్వరలోనే ముహూర్తాలున్నాయనీ, దగ్గరముహూర్తంలోనే పెండ్లి జరిగిపోవాలనీ రావుగారు సూచించారు. ఇది విని ఉష గదిలోనుండి మెట్లమీదకువచ్చి ఎదురుగా కనిపిస్తున్న కరుణని చిలిపిగా వెక్కిరించింది. అనుకున్న ప్రకారం వివాహం వైభవంగా జరిగిపోయింది. కట్నం ప్రసక్తే గాలేదసలు. తనకున్న ఆస్తినంతను రావుగారు మూడు భాగాలుచేసి ముగ్గురికీ పంచిపెట్టారు. కాని ఆ యింటి ఆచార వ్యవహారాలన్నీ మారిపోయాయి సుమా! యీ చివరి సంగతులు జరిగేనాటికి!

"ఏమండీ డైరెక్టరుగారూ! పాలని నీళ్లు పంపారేమిటి సిన్మా షూటింగ్ సందర్భమున!"

'పొరబాటు - యివ్వాళషూటింగ్ లో త్రాగవలసింది విషం! నిజమైనదే పంపమంటారా"

♦ ♦ ♦

"అదేమిటిరా! ఒకదాని వెంబడి మరొకటి సిగరెట్లు అలా తగలేస్తున్నావు!"

"మన మేగజైనుకు పొగ త్రాగడం దురలవాటనే వ్యాసాన్ని వ్రాస్తున్నారా"

♦ ♦ ♦

"శెట్టిగారూ! ఏమిచేస్తున్నారండీ"

'ఏమి చెయ్యడంలేదు రామయ్యా'!

"అయిదు రూపాయలు అప్పిద్దురూ!"

'అయితే మంచినిద్రలోనున్నాను'

పిళ్లా సుబ్బారావుశాస్త్రి